క్లుప్తంగా

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో పని చేస్తున్న ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను ఆర్టీసీ యాజమాన్యం పరిష్కరించాలని ఎంప్లాయిస్ యూనియన్ కడప డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఎ.రామ్మూర్తి, రాములు తెలిపారు. బుధవారం కడప డిపో కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. ఏపీ అమరావతి జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు రావాల్సిన ఆర్థికపరమైన అంశాలు, పీఆర్సీ, అరియర్స్, డీఏలు, మిగిలిపోయిన ఓటీలు, నైట్ అవుట్ అలవెన్సులు రావాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవచూపి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

'రూట' కృషి అభినందనీయం

కడప ఎడ్యుకేషన్: ఉర్దూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కానికి రూట సంఘం చేస్తున్న కృషి అభినందనీయం అని డీఈఓ రాఘవరెడ్డి కొనియాడారు. జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన రాఘవరెడ్డిని బుధవారం రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్(రూట) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇక్బాల్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు షాహిదుల్లా తదితరులు రూట డైరీ, క్యాలెండర్‌లు బహుకరించారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా హౌస్ బిల్డింగ్ సొసైటీ ప్రధాన కార్యదర్శి విశ్వనాథరెడ్డి, రూట రాష్ట్ర డైరీ కమిటి కో చైర్మన్ సయ్యద్ సిరాజుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మతోన్మాద విధానాలను తిప్పికొడదాం

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ మతోన్మాద విధానాలను ప్రజలు తిప్పి కొట్టాలని సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు చంద్రశేఖర్, చంద్ర పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సీపీఎం, సీపీఐ జిల్లా కమిటీల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై వేస్తున్న భారాలను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ఈ నెల 14 నుంచి 30వ తేదీ వరకు జిల్లాలోని 36 మండలాల్లో ప్రచార యాత్రలు చేపట్టి ప్రజలను చైతన్యవంతులను చేస్తామన్నారు. సీపీఎం, సీపీఐ నాయకులు రామ్మోహన్, కెసీ బాదుల్లా, నాగ సుబ్బారెడ్డి, ఫరూక్ హుస్సేన్, వలరాజు తదితరులు పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ

కడప ఎడ్యుకేషన్: బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని బుధవారం సామాజిక బాధ్యతలో భాగంగా ఎస్‌టీఎఫ్ ఉపాధ్యాయ సంఘం పాత రిమ్స్‌లోని మానసిక వికలాంగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, ఎస్‌టీఎఫ్ జనరల్ సెక్రటరీ సుబ్బారాజు, నాయకులు శ్రీనివాసులు, రవిశంకర్ పాల్గొన్నారు.

దళితుల సమస్యలను పరిష్కరించాలి

కడప కార్పొరేషన్: జిల్లాలో దళితుల సమస్యలను పరిష్కరించడమే ప్రధాన లక్ష్యంగా ఎస్సీ సెల్ నాయకులు పనిచేయాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. బుధవారం రోడ్లు, భవనాల అతిథి గృహంలో తనను కలిసిన వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్‌కుమార్, దళిత నాయకులతో ఆయన మాట్లాడారు. అనంతరం ఎస్సీనాయకులు ఎంపీని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మేయర్ సురేష్ బాబు, ఎస్సీసెల్ నగర అధ్యక్షుడు చైతన్య, కార్పొరేటర్ చెన్నయ్య, మేసా ప్రసాద్, శివ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన కాపు నేతలు

కడప కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును జిల్లాకు చెందిన కాపు నేతలు కలిసి ఘనంగా సన్మానించారు. బుధవారం ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి కళ్యాణోత్సవంలో పాల్గొనేందుకు వచ్చిన త్రిమూర్తులను కాపు సంక్షేమ సేన నాయకులు కలిసి తమ కార్యాలయానికి ఆహ్వానించి శాలువా, పూలమాలతో సత్కరించారు. కాపు సంక్షేమ సేన జిల్లా అధ్యక్షులు జేవీ రమణ, అక్కిశెట్టి శ్రీనివాసులు, బీటెక్ బాబు, దాసరి బాబు రావు, చలపతి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా కల్యాణం

ప్రొద్దుటూరు కల్చరల్ : రామేశ్వరంలోని ప్రసిద్ధి చెందిన ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వామి వారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. బుధవారం తెల్లవారుజామున శ్రీరామ చంద్రమూర్తి ప్రతిష్టించిన సైకత లింగానికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించి స్వామి, అమ్మవార్లను శోభాయమానంగా అలంకరించారు. రాత్రి గంగాగౌరి సమేత ముక్తిరామలింగేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ వేదికపై ఆసీనులను చేశారు. వేద పండితులు వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల మధ్య స్వామి వారి కల్యాణం సుముహూర్తంలో వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణం తిలకించడం వల్ల కలిగే శుభాలను అర్చకులు వివరించారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి కల్యాణాన్ని తిలకించారు.

ఆదర్శమూర్తి బాబూ జగ్జీవన్‌రామ్

● ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా



బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు



కేవీకేలో బాబు జగ్జీవన్‌రావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కేవీకే సమన్వయకర్త, శాస్త్రవేత్తలు

కడప కార్పొరేషన్: మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ ఆదర్శమూర్తి అని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా అన్నారు. జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం నగర అధ్యక్షుడు చైతన్య ఆధ్వర్యంలో మహావీర్ సర్కిల్‌లోని ఆయన విగ్రహానికి మేయర్ సురేష్ బాబుతో కలిసి డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పూల మాల వేసి నివాళులు అర్పించారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. మేయర్ సురేష్ బాబు మాట్లాడుతూ కేంద్ర మంత్రిగా జగ్జీవన్ రామ్ ఎన్నో సంస్కరణలు తెచ్చారని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ సోషల్‌వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్, జి. గరుడాద్రి, త్యాగరాజు, బండిప్రసాద్, బంగారు నాగయ్య పాల్గొన్నారు.

కడప రూరల్ : బాబు జగ్జీవన్‌రామ్ మానవతావాది అని వక్తలు కొనియాడారు. మంగళవారం జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు దేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసులురెడ్డి బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ పార్టీ నాయకులు అమీర్‌బాబు, మేకల వెంకటేశ్, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర నాయకులు ఆంజనేయులు, బీసీ గంగులు, మాతయ్య, మునెయ్య తదితరులు పాల్గొన్నారు. దళిత వేదిక ఆధ్వర్యంలో అధ్యక్షులు స్వామినాథన్ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

సమసమాజానికై పోరాడిన యోధుడు 'బాబూజీ'

కడప కల్చరల్ : అట్టడుగు వర్గాల సమానత్వం కోసం తుది శ్వాస వరకు పోరాడిన యోధుడిగా డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ దేశ వాసుల గుండెల్లో నిలిచిపోయారని యోగి వేమన విశ్వవిద్యాలయం కుల సచివులు ఆచార్య వైపీ వెంకట సుబ్బయ్య అన్నారు. వైవీయూ ఆధ్వర్యంలో బుధవారం బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి , మూల మల్లికార్జునరెడ్డి, బ్రౌన్ సిబ్బంది పాల్గొన్నారు.

● **కేంద్ర గ్రంథాలయంలో**

కడప నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సయ్యద్ అమీరుద్దీన్ పూలమాల వేసి నివాళులర్పించారు.

కడప వైఎస్ఆర్ సర్కిల్: బాబు జగ్జీవన్ రామ్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీసీసీ అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మహావీర్ సర్కిల్‌లో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి, ఇందిరాభవన్‌లో ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ నాయకులు విష్ణుప్రీతం రెడ్డి, గోర్ల శ్రీనివాసులు, ఆనంద్, చార్లెస్, శ్యామలా దేవి తదితరులు పాల్గొన్నారు.

● కార్మిక వర్గం పక్షపాతి బాబు జగ్జీవన్ రామ్ అని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు.

● బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్ రామ్ అని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వెంకట సుబ్బయ్య పేర్కొన్నారు.

● డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నగరంలోని మహావీర్ సర్కిల్‌లో ఆయన విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.

కడప అగ్రికల్చర్: బాబు జగ్జీవన్‌రావు అందరికీ ఆదర్శప్రాయుడని కృషి విజ్ఞానకేంద్ర సమన్వయకర్త డాక్టర్ వీరయ్య అన్నారు. బుధవారం కడప ఊటకూరు కృషి విజ్ఞాన కేంద్రలో బాబు జగ్జీవన్ రావు జయంతిని ఘనంగా నిర్వహించారు. కేవీకే శాస్త్రవేత్తలు శిల్పకళ, లావణ్య, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

తెలుగుభాషకు ప్రాధాన్యత అవసరం



తన రచనలను కలెక్టర్‌కు అందజేస్తున్న అధికార భాషా సంఘం సభ్యులు తవ్వా వెంకటయ్య

కడప కల్చరల్ : జిల్లాలో తెలుగుభాష అమలు విషయంగా ప్రాధాన్యతనివ్వాలని రాష్ట్ర అధికారభాషా సంఘం సభ్యులు తవ్వా వెంకటయ్య కలెక్టర్‌ను కోరారు. బుధవారం ఆయన కలెక్టర్ విజయరామరాజును ఆయన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. వైఎస్సార్ జిల్లాలో అధికారభాషగా తెలుగు గొప్పగా అమలయ్యేలా తగు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయన తన పరిశోధక గ్రంథాలు, ఇతర రచనలను కలెక్టర్‌కు అందజేశారు. స్పందించిన కలెక్టర్ త్వరలో జేసీ నేతృత్వంలో జిల్లా స్థాయి అధికారుల సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు.

'విద్వాన్ కట్టా' సేవలు చిరస్మరణీయం



విద్వాన్ కట్టా నరసింహులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీసీ, 'బ్రౌన్' సిబ్బంది

కడప కల్చరల్ : కైఫీయత్తుల పరిష్కర్త, సాహితీవేత్త విద్వాన్ కట్టా నరసింహులు బ్రౌన్ గ్రంథాలయానికి, తెలుగుభాషకు చేసిన సేవలు చిరస్మరణీయమని యోగి వేమన విశ్వవిద్యాలయం బాధ్య ఉపకులపతి ఆచార్య జింక రంగ జనార్దన అన్నారు. వైవీయూ ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో బుధవారం బ్రౌన్ గ్రంథాలయ తొలి బాధ్యులు విద్వాన్ కట్టా నరసింహులు 76వ జయంతిని నిర్వహించారు. కుల సచివులు ఆచార్య వైపీ వెంకటసుబ్బయ్య, బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, బ్రౌన్ కేంద్రం సలహామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్ , బ్రౌన్ గ్రంథాలయ సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, చింతకుంట శివారెడ్డి, గ్రంథ పాలకులు పాల్గొన్నారు.

నేటి నుంచి హుసేన్‌వలి స్వామి ఉరుసు

దువ్వూరు : మండల పరిధిలోని మీర్జఖాన్‌పల్లె గ్రామంలో వెలసిన శ్రీ నెమళ్లదిన్నె హుసేన్‌వలి స్వామి ఉరుసు గురు, శుక్రవారాల్లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. గురువారం గంధం, శ్రీ మదివ్రాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర నాటకం, శుక్రవారం ఉరుసు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఉరుసు సందర్భంగా ఓల్డ్ కేటగిరి వృషభాలకు బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ రెండు రోజులపాటు అన్నదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి



డ్వాక్రా సంఘాల సభ్యులకు మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

చెన్నూరు : మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఆసరా మూడవ విడత సంబరాలు కార్యక్రమంలో ఆయన జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డితో కలసి పాల్గొని మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే ఆ కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. గత ప్రభుత్వం రుణాలను మాఫీ చేయిస్తామని మాయమాటలు చెప్పి మోసం చేసిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో చెప్పిన మాటకు కట్టుబడి డ్వాక్రా అక్కా చెల్లెమ్మల బ్యాంకు రుణాలన్నింటినీ చెల్లించారన్నారు. అనంతరం మండల వ్యాప్తంగా 562 స్వయం సహాయక సంఘాలకు సంబంధించి రూ.4,15,36,735 చెక్కును మహిళలకు అందజేశారు. మహిళలంతా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండి ఆయనను ఆశీర్వదించాలన్నారు. అనంతరం డ్వాక్రా మహిళలు ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్‌వీఎస్ఆర్, రాష్ట్ర అటవీశాఖ డైరెక్టర్ రామన శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ మాజీ డీసీఎంఎస్ ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ సిద్దిగారి వెంకటసుబ్బయ్య, మండల ఉపాధ్యక్షులు ఆర్ఎస్ఆర్, గణేష్‌రెడ్డి, మండల కో ఆప్షన్ మెంబర్ వారిస్, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

కమలాపురం దర్గాలో భక్తుల సందడి



దర్గాలో వెలసిన దుకాణాల వద్ద భక్తులు

కమలాపురం : కమలాపురం పెద్ద దర్గాగా ప్రఖ్యాతి గాంచిన దర్గా–ఏ–గఫారియా, ఖాదరియా భక్తుల సందడిగా మారిపోయింది. బుధవారం నుంచి ఉరుసు ఉత్సవాలు ప్రారంభం కావడంతో దర్గా ప్రాంగణం అంతా భక్తులతో నిండి పోయింది. రంగు రంగుల విద్యుద్దీపాలతో దర్గా సుందరంగా కనిపించింది. అలాగే దర్గా స్వాగత ద్వారం, ఖవ్వాలీ స్టేజీలన్నీ అందంగా అలంకరించారు. అలాగే చిన్నారుల కోసం జాయింట్ వీల్, బ్రేక్ డ్యాన్స్ లాంటివి ఏర్పాటు చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచే కాక తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. గంధం ఇంటి నుంచి నషాన్ జెండాను వైభవంగా ఊరేగించారు. బాణా సంచా పేల్చుతూ డప్పు వాయిద్యాలతో ఊరేగింపు సాగింది. అనంతరం దర్గా చేరుకుని ప్రార్థనలు నిర్వహించారు.

అభినందన మాల



బద్వేలు : కాశినాయన మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ నల్లేరు విశ్వనాథరెడ్డి పుట్టినరోజు సందర్భంగా అభిమానులు, పార్టీ నాయకులు భారీ గజమాలతో అభినందనలు తెలిపారు. ఈ వేడుకలను పోరుమామిళ్లలోని ఆయన స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి వేలాదిగా వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, ప్రజాప్రతినిదులు, స్నేహితులు తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. విశ్వనాథరెడ్డి వారందరికీ ధన్యవాదాలు తెలపడంతో పాటు విందు ఏర్పాటు చేశారు.

తపస్కాల పవిత్ర సాంగ్యాలలో పాల్గొనండి

– ఫాదర్ అబ్రహం పిలుపు



దైవ సందేశం ఇస్తున్న ఫాదర్ అబ్రహం

కడప కల్చరల్ : క్రైస్తవులందరూ తపస్కాల పవిత్ర సాంగ్యాలలో పాల్గొనాలని ఆరోగ్యమాత పుణ్య క్షేత్రం డైరెక్టర్ ఫాదర్ అబ్రహం పిలుపునిచ్చారు. బుధవారం చర్చి ఆవరణలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేకి ముందు జరిగే తపస్కాల సాంగ్యాలలో పాల్గొని మనకోసం శిలువలో మరణించి ఉత్థానం చెందిన క్రీస్తునాథుని ఆశీర్వాదం పొందడానికీ, దివ్య సంస్కార సాంగ్యాలలో పాల్గొనడానికి తప్పక రావాలని సూచించారు. గుడ్‌ఫ్రైడే విశేష కార్యక్రమాలు ప్రారంభమయ్యాయని ఆయన తెలిపారు. అందులో భాగంగా పెద్ద బేస్తవారాన్ని పురస్కరించుకుని సాయంత్రం 5.30 గంటలకు పాప సంకీర్తన, పవిత్ర దివ్య బలిపూజలో పూజలు నిర్వహిస్తామని తెలిపారు. ఇందులో శిష్యుల పాదాలు కడిగే సాంగ్యం ప్రధానమని వివరించారు. అనంతరం కడరాత్రి భోజన కార్యక్రమంలో ప్రత్యేకంగా అలంకరించిన దివ్య మండపంలో రాత్రి 12 గంటల వరకు దివ్య సత్ప్రసాద ఆరాధన ఆశీర్వాదం ఉంటుందన్నారు. పవిత్ర శుభ శుక్రవారం నాడు మధ్యాహ్నం 2 గంటలకు చర్చి ఆవరణలో శిలువ మార్గం నిర్వహిస్తామని తెలిపారు. క్రీస్తు పునరుత్థాన మహోత్సవ పరిశుద్ధ ఆదివారం ఉదయం 8 గంటలకు ప్రత్యేక దివ్య బలిపూజ ఉంటుందని, అనంతరం సకల మానవాళికి క్రీస్తు పునరుత్థాన పవిత్ర ముగింపు సాంగ్యాలు ఉంటాయని వివరించారు.

హోండా నూతన బైక్ ఆవిష్కరణ



డాక్టర్ ఆబిద్‌కు బైక్ తాళం చెవిని అందజేస్తున్న సుంకర శ్రీనివాస్

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప నగరం చిన్నచౌకులోని అమోఘ హోండా షోరూంలో జిల్లాలో తొలిసారిగా హోండా బింగ్‌వింగ్ హీనస్–350 సీసీ నుంచి 500 సీసీ వాహనాన్ని విడుదల చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన అమోఘ హోండా ఎండీ సుంకర శ్రీనివాస్, కర్ణాటక బ్యాంకు మేనేజర్ మంజునాథ్, టీవీఎస్ కె.మధు, జనరల్ మేనేజర్ సి.మల్లికార్జున తదితరులు బైక్‌ను మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా సుంకర శ్రీనివాస్ మాట్లాడుతూ నూతన బైక్ 350 సీసీ ఈ రంగంలో మొదటిస్థానంలో ఉందన్నారు. నూతన బైక్‌ను డాక్టర్ ఆబిద్, శ్రీనివాస్, చంద్రహాసకుమార్, సుల్తాన్ సలావుద్దీన్, కృష్ణ వికాస్‌లు కొనుగోలు చేశారు. కార్యక్రమంలో షోరూం మేనేజర్, సిబ్బంది, కస్టమర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత వీణా విజయరామరాజు

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ, విద్యారంగ సంక్షేమం కోసం జీవితాన్ని ధారపోసిన మహనుభావుడు వీణా విజయరామరాజు అని మాజీ శాసనమండలి సభ్యులు కత్తి నరసింహారెడ్డి పేర్కొన్నారు. బుధవారం కడపలోని ఎస్టీయూ భవన్‌లో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి అధ్యక్షతన వీణా విజయరామరాజు వర్ధంతిని, బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, ఏఐటీయూసీ కార్యదర్శి నాగసుబ్బారెడ్డి, ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు.

బడుగు వర్గాలకు టీడీపీ చేసింది శూన్యం

– వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్



కడప కార్పొరేషన్: అణగారిన, దళిత, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలకు తెలుగుదేశం పార్టీ చేసింది శూన్యమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ విమర్శించారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ పాదయాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై వ్యక్తిగత విమర్శలు చేయడానికే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారని తెలిపారు. 14 ఏళ్లపాటు అధికారంలో ఉన్న ఆ పార్టీ ఏ వర్గానికీ మేలు చేయలేదన్నారు. దివంగత ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి పార్టీని లాక్కున్న చంద్రబాబు, లోకేష్‌లకు అది తమ పార్టీ అని చెప్పుకునే హక్కు లేదన్నారు. ఎన్టీఆర్ వారసులకు దాన్ని అప్పగించి, సొంతంగా పార్టీని స్థాపించి ప్రజల్లోకి రావాలని సవాల్ విసిరారు. ఎవరితో పొత్తు పెట్టుకోకుండా ఎన్నికల్లో దిగి 175 స్థానాల్లో పోటీ చేసే దమ్ము, ధైర్యం టీడీపీకి ఉందా అని ఆయన సూటిగా ప్రశ్నించారు.

'మా నమ్మకం నువ్వే జగన్' పోస్టర్లు ఆవిష్కరణ

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రూపొందించిన 'జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్' పోస్టర్లను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కె. సురేష్ బాబు, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ నినాదాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలన్నారు. ఈ నెల 7 నుంచి 20వ తేదీ వరకూ ఈ కార్యక్రమం విస్తృతంగా చేపట్టాలన్నారు. ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, రామ్మోహన్‌రెడ్డి, బండి ప్రసాద్, బాలస్వామిరెడ్డి, బాదుల్లా పాల్గొన్నారు.



మా నమ్మకం నువ్వే జగన్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కార్మికులకు అండగా ఉండాలి

కడప కల్చరల్: తొమ్మిదేళ్ల ఎన్‌డీఏ పాలనలో కార్పొరేట్లకు సంపద, పేదలకు దరిద్రం దక్కాయని, ఈ పరిస్థితి పోవాలంటే ప్రత్యామ్నాయ విధానాలే శరణ్యమని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం కడప డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి అన్నారు. దేశ వ్యాప్త పిలుపుమేరకు స్థానిక ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం వద్ద సంఘం అధ్యక్షులు అవధానం శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన భోజన విరామ ప్రదర్శనలో ఆయన మాట్లాడారు. ఈ ప్రభుత్వ హయాంలో దేశంలో జీడీపీ పతనమైందని, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం అదుపు తప్పాయన్నారు. ఎల్ఐసీ లాంటి ప్రభుత్వరంగ సంస్థ మార్కెట్ లీడర్‌గా విజృంభిస్తూ ఉన్నా కేంద్రం వాటిని బలహీనపరిచే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. కార్మికులందరికీ రూ. 26 వేల కనీస వేతనం, రూ.10 వేల కనీస పెన్షన్ చెల్లించాలని, నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. పెన్షనర్ల సంఘం కార్యదర్శి సుధీకర్, యూనియన్ నాయకులు అమీనా పర్వీన్, రాజు, అయ్యవారు రెడ్డి, శ్రీకృష్ణ, కుమార్, నజీరుల్లా, చంద్ర, నరసయ్య, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం వెంటనే డీఎస్సీ నిర్వహించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శేఖర్‌బాబు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామసుబ్బయ్య, సీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఖాళీలను భర్తీ చేయక అప్‌గ్రేడేషన్ పేరుతో పోస్టులు రద్దు చేసుకుంటూ పోవడం అన్యాయం అన్నారు. ప్రపంచ బ్యాంకుల షరతులను విద్యపై రుద్దడం సబబుకాదన్నారు. జేఎల్ పదోన్నతులు ఉపాధ్యాయలకు ఇవ్వకుండా కేవలం బోధనేతర సిబ్బందికి కల్పించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అపార అనుభవం ఉన్న ఉపాధ్యాయులకు జేఎల్ పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ, జేఎల్ పదోన్నతుల కోసం ఈ నెల 23న కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్నమయ్య జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అలీఖాన్, చంగల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్‌సీసీలో చేరేలా చైతన్యం తీసుకురావాలి

వైవీయూ: ఎన్‌సీసీలో చేరేలా విద్యార్థుల్లో చైతన్యం తీసుకురావాలని కడప 30 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రాజ్‌కుమార్ థాపా సూచించారు. తెలుగుగంగకాలనీలోని ఎన్‌సీసీ నగర్‌లో పర్మినెంట్ ఇన్‌స్ట్రక్టర్స్ ఓరియంటేషన్ కోర్సు (పీఐఓసీ)లో భాగంగా తిరుపతి గ్రూప్ పరిధిలోని ఆర్మీ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఓ మాట్లాడుతూ ఆర్మీ విధులు నిర్వహించిన సిబ్బందికి ఎన్‌సీసీ విధివిధానాలు, శిక్షణ పట్ల అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్‌సీసీ అధికారి ఇమామ్ ఖాసీం మాట్లాడారు. కార్యక్రమంలో పర్మినెంట్ ఇన్‌స్ట్రక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

వేంపల్లె: ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో 14 ఏళ్లుగా పనిచేస్తున్న వాచ్‌మెన్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కె.సి. బాదుల్లా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం స్థానిక ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో సెక్యూరిటీ గార్డుల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. ఇంతవరకు వాచ్‌మెన్లకు వేతనాలు పెంచకపోవడంతో వారిలో భయాందోళన వ్యక్తమవుతోందన్నారు. పేరుకు మాత్రమే వాచ్‌మెన్ ఉద్యోగమని.. అన్ని రకాల పనులు చేయించుకుంటున్నారన్నారు.